ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు

నేడు కౌన్సెలింగ్

» కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో ఉదయం 8 గంటల నుంచి



పురాతన నాణేలపై ముద్రితమై ఉన్న తెలుగు భాష

అమ్మలాంటి.. కమ్మనైన..
తెలుగు భాష

» నేడు తెలుగు భాషా దినోత్సవం

» ప్రత్యేకత సంతరించుకున్న బ్రిటీష్ కాలం నాటి నాణేలు

» తెలుగు లిపిలో నాణేలు ముద్రించిన కాకతీయ, మధురై రాజులు

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 28: దేశభాషలందు తెలుగు లెస్స అన్నాడో మహాకవి.. తెలుగు భాష తియ్యదనం ఎంతో గొప్పది. అమ్మలాంటి కమ్మనైన భాషగా తెలుగు కీర్తి గడించింది. సంస్కృతి, సంప్రదాయం సైతం భాషతో ముడిపడి ఉన్నాయి. ఇతర దేశాలకు చెందిన వారు సైతం తెలుగుభాషతోపాటు సంస్కృతి సంప్రదాయాలకు విలువనిచ్చారు. పురాతన నాణేలు, శాసనాలు ప్రాచీన వారసత్వ సంపదగా నిలుస్తున్నాయి. భాషా వైభవానికి పలువురు అనేకరకాలుగా కృషి చేశారు. వాటిలో ముఖ్యమైనవి తాళపత్ర గ్రంథాలు, నాణేలు, శాసనాలు. వీటి ద్వారా భాష గొప్పతనం తెలుస్తుంది. బ్రిటీష్ ఇండియా, కాకతీయ రాజులు, మధురై పుట్టుకొట్టమ్ తదితర రాజులు ఆయా దేశాల్లోని నాణేలపై తెలుగు పదాలను ముద్రించారు. ఈ నాణేలను కాకినాడకు చెందిన సాహితీవేత్త మార్ని జానకిరామచౌదరి సేకరించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా వీటి గురించి ఆయన తెలియజేశారు.



ఈస్ట్ ఇండియా కంపెనీవారు తెలుగు భాషలో ముద్రించిన నాణేలు



కాకతీయ, మధురై రాజులు తెలుగు భాషలో ముద్రించిన పురాతన నాణేలు



ప్రాచీన కాలం నాటి నాణేల్లో తెలుగుదనం



ప్రాచీనకాలం నాటి నాణేలు తెలుగుజాతి, భాష, సాంస్కృతిక ఉజ్జీవనానికి కొలమానం. కాకతీయులు తమ నాణేలపై తెలుగు లిపిలో దాయిగజకేసరి, దాయన సేనాని తదితర పదాలను ముద్రించారు. మధురై కేంద్రంగా పాలించిన ఆంధ్ర నాయక రాజులు శ్రీ, శ్రీ వీర, వియ, తిరువేంగళ, ముద్దు కృష్ణ వంటి పదాలతో నాణేలను రూపొందించారు. తెలుగు భాష ఉన్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిగేలా చర్యలు తీసుకోవాలి. భాషా చైతన్యానికి స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలి. సంఘ సంస్కర్త గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

-మార్ని జానకిరామచౌదరి, సాహితీవేత్త, నాణేలు సేకరణకర్త



పోలవరం ఎడమ కాలువ

వరాల మూటలే

కేంద్ర, రాష్ట్ర కేబినెట్ నిర్ణయాలతో జిల్లాలో పలు కీలక అంశాలకు మహర్దశ పట్టనుంది. ఎన్నో ఏళ్లనుంచి అపరిష్కృతంగా మారిన సమస్యలకు పరిష్కారం లభించనుంది. ప్రధానంగా వ్యవసాయ అధారిత జిల్లా అయిన కాకినాడకు కేంద్ర, రాష్ట్ర కేబినేట్ నిర్ణయాలు జీవం పోశాయి.



» కేంద్ర, రాష్ట్ర కేబినేట్ నిర్ణయాలతో పలు అంశాల్లో మహర్దశ

» పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,157కోట్లు ఇవ్వడానికి అంగీకారంతో హర్షం

» ప్రాజెక్టు పూర్తయితే ఏలేరు, పంపా, తాండకు మంచిరోజులు

» మెట్ట ప్రాంతంలో తీరనున్న తాగు, సాగునీటి సమస్యలు

» ఎడమ కాలువ ప్రాజెక్టు పనుల పునరుద్ధరణకు రాష్ట్ర కేబినేట్ ఆమోదంతో పనుల్లో రానున్న కదలిక

» నీటి సంఘాల ఎన్నికలతో తీరనున్న సాగునీటి కష్టాలు

» జిల్లాలో కొత్తగా 275 డిపోలు ఏర్పాటుకు అవకాశం

» పాత మద్యం విధానంతో మళ్లీ ప్రైవేటు దుకాణాలకు మోక్షం

» కాకినాడలో నాలుగు ఎఫ్ఎం కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం ఓకే

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం కోసం కేంద్రం బుధవారం రూ.12,157కోట్లు ప్రకటించింది. ఒకరకంగా ఇది కూటమి ప్రభుత్వానికి పెద్ద ఊరటే అని చెప్పాలి. కేంద్రం నిధులు విడుదల చేసిన నేపథ్యంలో 2026 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో జిల్లాలో లక్షల ఎకరాల అయకట్టుకు కొత్తగా సాగునీరు అందనుంది. ఏలేరు రిజర్వాయరుకు జలకళ పూర్తిస్థాయిలో పెరగనుంది. సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో 680సంఘాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. తద్వారా కొత్త సంఘాల రాకతో తిరిగి సాగునీటి రంగం కష్టాలు తీరనున్నాయి. మరోపక్క రేషన్ దుకాణాలు జిల్లాకు కొత్తగా 275 రాబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర కేబినేట్ నిర్ణయంతో జిల్లాలో కొత్త డిపోలు ఏర్పడనున్నాయి. పాత మద్యం విధానానికి ఆమోదముద్ర వేయడంతో తిరిగి మద్యం దుకాణాలు ప్రైవేటువి రాబోతున్నాయి. అటు జిల్లాలో ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు మితిమీరిన ప్రవర్తన లేకుండా చూసుకునే బాధ్యత వారిదేనంటూ సుతిమెత్తగా హెచ్చరించారు. మరోపక్క కాకినాడలో కొత్తగా నాలుగు ప్రైవేటు ఎఫ్ఎం రేడియో స్టేషన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఇక జల కళే...

జిల్లాలో ఏలేరు రిజర్వాయరు ఎంతో కీలకమైంది. 24.110 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగి ఉన్న ఈ రిజర్వాయరు కింద 67వేల ఎకరాల వరకు సాగవుతోంది. ఇదికాకుండా రిజర్వాయరు నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్, విశాఖ నగర అవసరాలకు 5 టీఎంసీల వరకు నీరు సరఫరా అవుతోంది. ఏడాదిలో కొన్నిరోజులపాటు రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో ఉండడం లేదు. దీంతో తాగు, సాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భవిష్యత్తులో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏలేరుకు మహర్దశ పట్టనుంది. ఇప్పుడున్న ఆయకట్టు పెరిగి మొత్తం 1.25లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసుకునే అవకాశం ఏర్పడనుంది. ఆయకట్టు స్థిరీకరణకు ఇక ఢోకా ఉండదు. జిల్లాలో పంపా రిజర్వాయరు కింద 12వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు పూర్తయితే మరింత సామర్థ్యం పెరిగి దిగువనున్న వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా లభించనుంది. తాండవ రిజర్వాయరుకు సైతం సాగునీటి కష్టాలు తీరనున్నాయి. మరోపక్క ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో మెట్టప్రాంతానికి మంచిరోజులు వచ్చినట్టే. ఎడమ కాలువ మీద అనేక ఎత్తిపోతల పథకాల నిర్మాణం ద్వారా అన్ని మెట్ట మండలాలకు పుష్కలంగా తాగు,సాగునీటిని మళ్లించుకునే అవకాశం ఏర్పడనుంది. మరోపక్క జిల్లా మీదుగా పోలవరం ఎడమ కాలువ పయనిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోకపోవడంతో కాలువలో పూడిక పేరుకుపోయింది. పలుచోట్ల జాతీయ రహదారి మీద నుంచి కాలువ అలైన్‌మెంట్ వెళ్తుండడంతో నిధులు లేక ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి. ప్రధానంగా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో కాలువ పనులకు చిక్కులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఎడమ కాలువ ప్రాజెక్టు పనులను పునరుద్ధరించడానికి రాష్ట్ర కేబినేట్ నిర్ణయించడంతో జిల్లాలో కాలువకు కష్టాలు తీరనున్నాయి. మరోపక్క ఈ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చాలని ప్రభుత్వం భావిస్తున్నా కాలువ ద్వారా వెళ్లే నీటిలో ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లో కొన్ని చిన్న తరహా ఎత్తిపోతల పథకాలకు నీరు అందనుంది. మరోపక్క సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయిదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం తీరుతో సాగునీటి సంఘాలు నిర్వీర్యం అయ్యాయి. ఎన్నికలు లేక నిర్జీవంగా మారాయి. సాగునీటి కష్టాలు చిన్నాచితకా తీర్చే నాథుడు లేక రైతులు ఖరీఫ్‌లో ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర కేబినేట్ నిర్ణయంతో జిల్లాలో దాదాపు 680 సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇవి కొత్తగా ఏర్పాటైతే చిన్న తరహా సాగునీటి సమస్యలకు తక్షణం పరిష్కారం లభించనుంది.

రేషన్‌డిపోలు.. మద్యం దుకాణాలు

మరోపక్క రాష్ట్రంలో కొత్తగా రేషన్ డిపోలను ఏర్పాటు చేయడానికి కేబినేట్ పచ్చజెండా ఊపడంతో జిల్లాలో కొత్తగా 235 రేషన్‌డిపోలు రానున్నాయి. ఇప్పటికే వీటిని ఏర్పాటు చేయడానికి జిల్లా అధికారులు నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. రాష్ట్రంలో మళ్లీ పాత మద్యం విధానానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీంతో త్వరలో జిల్లాలో ఉన్న 280వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు కనుమరుగుకానున్నాయి. వీటి స్థానంలో ప్రైవేటు దుకాణాలు ఏర్పాటవుతాయి. బహిరంగ వేలం విధానాల్లో వీటిని ఏర్పాటు చేయించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొందరు ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల మితిమీరిన ప్రవర్తనతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని సీఎం చంద్రబాబు బుధవారం నాటి కేబినేట్ సమావేశంలో అసహనం వ్యక్తం చేశారు. అధికారం ఉందనే కారణంతో కుటుంబ సభ్యులు అదుపు తప్పి ప్రవర్తించకుండా చూసుకునే బాధ్యత ఎమ్మెల్యేలదేనని సీఎం సుతిమెత్తగా హెచ్చరించారు. నామినేటెడ్ పోస్టులు కష్టపడే నేతలకే కట్టబెడతానన్నారు. దీంతో జిల్లానుంచి పదవులు ఆశిస్తున్న నేతలు ఎప్పుడు తమకు కొలువులు వరిస్తాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా కాకినాడ నగరంలో కొత్తగా మరో నాలుగు ప్రైవేటు ఎఫ్ఎం సెంటర్లను ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపింది.

సాగునీటి సంఘాల పునరుజ్జీవానికి సమాలోచనలు



» అయిదేళ్లుగా ఎన్నికలు నిర్వహించని గత వైసీపీ ప్రభుత్వం

» దీని పర్యావసానంగా రైతులకు సాగునీటి ఇక్కట్లు

» ఇప్పుడు తెరపైకి సాగునీటి సంఘాల ఎన్నికల అంశం

» కూటమి ప్రభుత్వంపై రైతుల ప్రశంసల జల్లు

సామర్లకోట, ఆగస్టు 28: సాగునీరు పుష్కలంగా సరఫరా అయ్యే ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుంది. పచ్చదనంతో పరిఢవిల్లుతుంది. అంత కీలకమైన సాగునీరు పొలాలకు సవ్యంగా సరఫరా కావాలన్నా.. ఏటా అయకట్టు విస్తరించాలన్నా నీటి వనరుల నిర్వహణ ముఖ్యం. వీటిని నిరంతరం పర్యవేక్షించే సంఘాలు అంతకన్నా కీలకం. మరి సంఘాలు పనిచేస్తున్నాయా అంటే.. అసలు ఉంటే కదా పనిచేయడానికి.. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలు చేపట్టలేదు. పర్యావసానంగా నీటి వనరులు గాడి తప్పాయి. కాలువలు పూడికలతో నిండి ఆనవాళ్లే లేకుండాపోయాయి. చెరువులు ఇదేరీతిలో ఆకారాలు కోల్పోయాయి.

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరుల ఆధారంగా సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు జరపాలని కూటమి ప్రభుత్వం తాజాగా నిర్ణయించడంతో రైతు వర్గాల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నాశనమైన రీతిలోనే అయిదేళ్లుగా సాగునీటి వినియోగదారుల సంఘాలు కూడా వైసీపీ ప్రభుత్వ హయాంలో అటకెక్కాయి. జిల్లాలో సాగునీటి సంఘాలు నిస్తేజంగా మారాయి. కార్యవర్గాలు లేక సాగునీటి వనరుల నిర్వహణ లేక అచేతనంగా ఉన్నాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చెరువులు, కాలువలు, ఆయకట్టు పరిధిలో ఏ చిన్న సమస్య వచ్చినా నీటి సంఘాల ప్రతినిధులు స్పందించేవారు. వైసీపీ హయాంలో ఐదేళ్లూ వాటి ఛాయలకు కూడా పోలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 680 సాగునీటి సంఘాలు ఉన్నాయి. సుబ్బారెడ్డి సాగర్, ఏలేరు ప్రాజెక్టుల పరిధిలోను ఎత్తిపోతల పథకాల పరిధిలోను చెరువుల ఆయకట్టు పరిధిలోను ఉన్నాయి. చెరువుల్లో పూడికతీత, మదుములు, తూములు నిర్మాణం, మరమ్మతులు, కాలువల విస్తరణలు, జంగిల్ క్లియరెన్స్‌లు వంటి పనులు నీటి సంఘాలు చేపట్టేవి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.

గతంలో.. చంద్రబాబు, వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో నీటి సంఘాల పాత్ర కీలకంగా ఉండేది. ఏటా ఖరీఫ్, రబీకి ముందు నీటి సంఘాల ఆధ్వర్యంలో రైతులతో గ్రామసభలు నిర్వహించేవారు. చెరువులు, కాలువల అభివృద్ధికి పనులను గుర్తించేవారు. రైతులనుంచి అభిప్రాయాలు సేకరించేవారు. ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి వాటిని నివేదించేవారు. వాటికి అనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేది. దీంతో చెరువులు, కాలువల పరిధిలో శివారు ఆయకట్టుకు సైతం సాగునీరు అందేది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అటువంటి దాఖలాలు లేకపోయాయి. ఆయా నీటి సంఘాలకు ఏఈ, జేఈ, డీఈఈ, ఎస్ఈ స్థాయిల్లో ఇరిగేషన్ అధికారులు ప్రత్యేకాధికారులుగా వ్యవహరించేవారు.

నిధులు ఇలా..

వాస్తవానికి సాగునీటి సంఘాలకు స్థానిక సంస్థలనుంచి నిధులు సమకూరుతాయి. రైతులు స్థానిక సంస్థల నుంచి నీటి పన్నులను నీటి సంఘాల ఖాతాలకు జమచేయించగా వాటికి తోడు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసేది. దీంతో రైతులకు అవసరమయ్యే పనులు శరవేగంగా పూర్తయ్యేవి. ఎన్నికలు కూడా రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా జరిగేవి. క్రియాశీలకంగా ఉండే రైతు ప్రతినిధులను ఎన్నుకునేవారు. భూమి కలిగి పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా చేర్చేవారు. మేజర్, మీడియం, మైనర్‌సాగునీటి సంఘాలుగా విభజించి టెర్రిటోరియల్ మెంబర్లుగా ఎన్నుకునేవారు. వారిలో ఒకరు సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించేవారు. సంఘాల కాలపరిధి ఐదేళ్లు. ఈ సంఘాల సభ్యులను జిల్లా కలెక్టర్లు గుర్తిస్తారు. నిధుల విడుదలలో పారదర్శకత పాటించేందుకు ఉమ్మడి అకౌంట్ ఉండేది. ఎం బుక్ ప్రాప్తికి పనులు పూర్తయిన వెంటనే బిల్లుల చెల్లింపులు జరిగేవి. యంత్రాల సాయంతో రైతులకు అవసరమైన పనులు చేపట్టేవారు. నిర్వీర్యమైన వ్యవస్థలను తిరిగి బలోపేతం చేయడంలో భాగంగా తాజాగా కూటమి ప్రభుత్వంలో నీటి వినియోగదారుల సంఘాల బలోపేతంపై దృష్టిసారించడంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఆస్తిపన్ను వసూలుపై కార్యాచరణ
రూపొందించుకోవాలి

» ఫిఫ్త్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నకుమారి

కాకినాడ సిటీ, ఆగస్టు 28: గ్రామస్థాయి ఆస్తిపన్ను రాబడిలో ఇంటి పన్ను ప్రధానమైనదని, సదరు పన్ను నూరుశాతం వసూలు రాబట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఫిఫ్త్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్.రత్నకుమారి అన్నారు. కాకినాడలోని ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో బుధవారం ఫిఫ్త్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్‌పర్సన్ రత్నకుమారి అధ్యక్షతన కమిషన్ సభ్యులు కేవీ రమణరెడ్డి, ఎ.ప్రసాదరావు, ఎంవీఎస్ పద్మారావు, కె.కృష్ణారావు, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన డీఎల్పీవోలు, డీఎల్డీవోలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించారు. నూరుశాతం పన్నుల వసూలుకు తీసుకోవాల్సిన చర్యలపై ఛైర్‌పర్సన్ పలు సూచనలు చేశారు. గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో సొంత వనరులను ఎలా అభివృద్ధి చేసుకోవాలి, వాటి ద్వారా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టడం, పెండింగ్ బకాయిలు వసూలు తదితర అంశాలపై ఛైర్‌పర్సన్ చర్చించారు. కాకినాడ జడ్పీ సీఈవో ఎ.రామచంద్రమూర్తి, జిల్లా డీపీవో, డీఎల్పీవో, డీఎల్డీవో, జిల్లాకు చెందిన 20మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్చకులకు.. శుభవార్త



పిఠాపురం, ఆగస్టు 28: ఎన్నికలముందు ఇచ్చిన ప్రతిమాట నిలబెట్టుకునేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ఆలయాల్లో పనిచేసే అర్చకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త చెప్పారు. వారి వేతనాన్ని ఒకేసారి 50శాతం పెంచగా ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాలను రెట్టింపు చేశారు. ఈ నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఆలయాల్లో పనిచేసే అర్చకులకు వేతనాలు, దూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తాలను పెంచడంతోపాటు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయింపు, కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీబ్రాహ్మణులకు చోటు కల్పించడం తదితర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా సీఎం చంద్రబాబు ఆయా వర్గాలకు శుభవార్త వినిపించారు. వైసీపీ పాలనలో ఆలయాల నిర్వహణను గాలికి వదిలివేశారు. అర్చకులు ఇచ్చే కనీస మొత్తాలను సకాలంలో చెల్లించలేదు. దూపదీప నైవేద్యాలకు నిధులు విడుదల కాక పూజాది కైంకర్యాలకు ఇబ్బందులు ఎదురయ్యేవి. వీటిని దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టోలో వారి సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను పొందుపరిచారు.

దూపదీప నైవేద్యాలకు..

కనీస ఆదాయం లేని ఆలయాల్లో దూప దీప నైవేద్యాలకు ప్రభుత్వం కొంత మేర ఆర్థిక సహాయం అందిస్తోంది. దూప దీప నైవేద్య పథకం కింద నెల రూ.5వేలను ఆలయాల నిర్వహణకు అందించేవారు. దేవదాయశాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు దూప దీప నైవేద్యాల పథకాల ద్వారా రూ.50వేలలోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ప్రతినెల అందించే మొత్తాన్ని రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకేసారి 100శాతం పెంచడంతో నిధులు లేని ఆలయాల్లో ఇబ్బందులు ఉండవని జిల్లాలోని వివిధ ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం అమలులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. రూ.50వేలకు పైగా ఆదాయం ఉన్న ఆలయాల్లో ప్రస్తుతం అర్చకులకు ప్రతినెలా రూ.10వేలు వేతనంగా ఇస్తున్నారు. దీన్ని రూ.15వేలకు పెంచాలని, ఇది కనీస వేతనంగా ఉండాలని నిర్ణయించారు. దీనితో అర్చకుల వేతనాలు 50శాతం పెరగనున్నాయి. వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారికి ప్రతినెలా రూ.3వేలను భృతిగా అందిస్తారు.

» వేతనం నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంపు

» ఆలయాల్లో దూపదీప నైవేద్యాలకు ఇక రూ.10వేలు

» వేద విద్య నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3వేల భృతి

» ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

ఆలయాల్లో సేవలు నగదు రహితం

ఆలయాల్లో సేవలన్నింటినీ ఆన్‌లైన్‌లో నగదు రహితంగా అందించాలని నిర్ణయించారు. తొలుత ప్రధాన ఆలయాల్లో అమలు చేసి అన్ని ఆలయాలకు వర్తింప చేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీన్ని తొలుత అన్నవరం దేవస్థానంలో అమలు చేస్తారు. తదనంతరం జిల్లాలోని పిఠాపురం పాదగయ క్షేత్రం, సామర్లకోట కుమారభీమేశ్వరస్వామి, తుని తలుపులమ్మ లోవ ఆలయాలు సహా 25 ఆలయాల్లో అమలు చేసేందుకు దేవదాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఆలయాల ధర్మకర్తల మండలిలో ప్రస్తుతం ఉన్న సభ్యులకు ఆదనంగా మరో ఇద్దరు సభ్యులను నియమించనున్నారు. ఒక బ్రాహ్మణ, ఒక నాయీబ్రాహ్మణ సభ్యుడికి చోటు కల్పించాలని నిర్ణయం తీసుకోవడంతో ఆయా వర్గాలకు ప్రాధాన్యం లభించనుంది. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజున దేవదాయశాఖ ద్వారా అధికారికంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ప్రతి గ్రామం, ప్రతి వాడలో ఆలయం

ప్రతి గ్రామం, ప్రతి వాడలో ఆలయాలు ఉండేలా చూడాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణానికి రూ.10లక్షలు ఇస్తుండగా ఆ మొత్తం సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మొత్తాలను 100శాతం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం నిర్మాణం కాని ఆలయాల పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలి: డీఈవో

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 28: దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యసనా నైపుణ్యాలు ఎలా పెంపొందించాలనే అంశంపై జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు. కాకినాడ కలెక్టర్ ఆఫీస్ విధాన సౌధ కాన్ఫరెన్స్ హాల్‌లో ట్యాబ్‌ల వినియోగంపై సహిత విద్య రిసోర్స్ పర్సన్లకు ఐఈఆర్‌పీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యను అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య విభాగం కన్సల్టెంట్ నరసింహం, సహాయక సమన్వయకర్త అమ్మినాయుడు, జిల్లా సహిత విద్యసమన్వయకర్త చామంతి నాగేశ్వరరావు, డిజిటల్ విద్యపై రాష్ట్రీ రీసోర్స్ అధికారిగా మహాలక్ష్మినాయుడు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కాకినాడలో 3కే ర్యాలీ

కాకినాడ అర్బన్, ఆగస్టు 28: హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆగస్టు 29న జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాకినాడ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో 3కే ర్యాలీ నిర్వహిస్తున్నట్టు డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. కాకినాడలోని భానుగుడి సెంటర్ నుంచి ర్యాలీ మొదలై డీఎస్‌ఏ మైదానంలోని ధ్యాన్‌చంద్ విగ్రహం వరకు ఉంటుందన్నారు. వందలాదిమంది క్రీడాకారులు పాల్గొంటారని, ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఏలేశ్వరంలో 56 మంది డిశ్చార్జి 7లో

సెలవులు ప్రకటనతో ఇళ్లకు తీసుకువెళ్లిన తల్లిదండ్రులు



యువకులకు సంఘీభావం తెలుపుతున్న మురళీకృష్ణ

యువ చైతన్య యాత్ర

మండపేట, ఆగస్టు 28: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ముగ్గురు యువకులు నడుంబిగించారు. విజయవాడ నుంచి కోల్‌కతా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతపురానికి చెందిన ప్రదీప్‌కుమార్, అన్నవరానికి చెందిన ఆకేటి సూరిబాబు, హైదరాబాద్‌కు చెందిన దొంత రాధాకృష్ణ ఈ నెల 21న విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద పాదయాత్ర ప్రారంభించారు. వారు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చేరుకోగా బీజేపీ నాయకుడు టి.మురళీకృష్ణ కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దాడులకు అత్యాచారాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, కోల్‌కతాలోని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ముగుస్తుందని చెప్పారు.

12 నుంచి పవిత్రోత్సవాలు

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, అదివాసాలు, 13, 14 తేదీల్లో ఉదయం అలంకార తిరుమంజనాలు, ప్రాయశ్చిత్త హోమాలు, పవిత్రారోహణ, 15న మహా శాంతి హోమం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రాల వినియోగం జరుగుతాయని అర్చకులు తెలిపారు.

25 లక్షల కోట్ల బకాయిల రద్దు వెనుక భారీ స్కామ్

- పోలవరం అవకతవకలపై విచారణ జరపాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల కాలంలో రూ.25లక్షల కోట్ల బకాయిలను రద్దు చేయించడం వెనుక భారీ స్కామ్ జరిగిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనలాంటి వారు బ్యాంకు రుణం తీసుకుంటే ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు బడా కార్పొరేట్ సంస్థలకు మాత్రం రుణ మాఫీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 25లక్షల కోట్ల అప్పులను రద్దు చేయించిన వారి పేర్లను బయటపెట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి, ఆర్బీఐ గవర్నర్‌కు లేఖలు పంపానన్నారు. పోలవరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో సీట్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలపై మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విచారించాలన్నారు. విశాఖ పోర్టులో పట్టుబడిన 25వేల కిలోల కొకైన్ కేసులో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ వర్గీకరణ చెల్లదని, అందుకే తాను సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశానన్నారు. క్రీమీలేయర్ విధానంతో అట్టడుగు దళితులు నష్టపోతారని, వచ్చేనెల 17న తన పోరాట కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి



గాయపడ్డ నాయుడు

కోటనందూరు, ఆగస్టు 28: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుసిరెడ్డి వీరవెంకట సత్య మణికంఠ నాయుడిపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. మణికంఠనాయుడు మంగళవారం రాత్రి భీమవరపుకోటలోని చెల్లెలి ఇంటికి వెళ్లి వస్తుండగా ఎస్ఆర్ పేట గ్రామ శివారులోని బ్రాందీ షాపు సమీపంలోని కల్వర్టు వద్ద అన్నంరెడ్డి మహేష్, అన్నంరెడ్డి సత్యనారాయణ, అన్నంరెడ్డి దుర్గాప్రసాద్, రుత్తల అయ్యప్ప దాడి చేశారు. గతంలో తన పెదనాన్న గొడవలను మనసులో పెట్టుకోవడంతో పాటు టీడీపీలో యాక్టివ్‌గా పని చేస్తుండడంతో ఈ దాడికి పాల్పడ్డారని బాధితుడు కోటనందూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలి


- దేశంలో 43వేల రకాల పంటల సాగు
- కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
- రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా: ఎమ్మెల్యే ఆనందరావు
- అమలాపురంలో కొబ్బరి రైతుల జాతీయ సదస్సు



అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్నజాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహన్‌మిశ్రా, మాట్లాడుతున్న జాతీయ కన్వీనర్ సుందరరాజన్

అమలాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా పేర్కొన్నారు. కొబ్బరి ఉప ఉత్పత్తులను తయారుచేసేందుకు రాయితీలతో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలోని 127 క్లైమేటివ్ జోన్లలో 43వేల రకాల పంటలు సాగవుతున్నాయనివివరించారు. కొబ్బరి పండించే జోన్ నుంచే ఇస్రో, డీఆర్డీవోవంటి సంస్థల్లో ఎందరో శాస్త్రవేత్తలుగా ఎదిగారని రైతుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. ప్రపంచంలో ఎత్తైన పంటను పండించే కొబ్బరి రైతులు తలెత్తుకునేలా తిరిగితేనే దేశం అభివృద్ధి బాటన నడుస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి రైతుల జాతీయ సదస్సు నిర్వహించారు. తొలుత బీకేఎస్ పతాకాన్ని జాతీయ కన్వీనర్ సుందరరాజన్ ఆవిష్కరించారు. భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజలు నిర్వహించి జ్యోతిప్రజ్వలన చేశారు. పార్టీలు వేరైనా.. కులాలు వేరైనా.. మతాలు వేరైనా.. పంటలు వేరైనా.. రైతులంతా ఒక్కటేనంటూ పిడికిలి బిగించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సుందరరాజన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరాఘవులు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ కొవిడ్ విపత్తు సమయంలో అన్ని వ్యవస్థలూ నిలిచిపోయినా ప్రపంచవ్యాప్తంగా రైతులు మాత్రమే చేలల్లో దిగి పంటలు పండించారన్నారు. కొవిడ్‌తో ఏ ఒక్క రైతూ చనిపోలేదన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ పనస పొట్టుపై మాట్లాడడంతో దానికి డిమాండు విపరీతంగా పెరిగిందన్నారు. 2026ని కొబ్బరి సంవత్సరంగా ప్రకటించి కొబ్బరిపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సి ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం కొబ్బరి కాయ ధర రూ.20 ఉంటే ప్రస్తుతం రూ.7కు పడిపోయిందని, దానికి తోడు నాణ్యత కూడా తగ్గిపోయిందన్నారు. కొబ్బరి రైతులను ఆదుకునేలా మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిసా నుంచి హాజరైన బీకేఎస్ నాయకులు తమ సమస్యలను వివరించారు. కర్ణాటక అధ్యక్షుడు గంగాధర్, తమిళనాడు అధ్యక్షుడు పార్థసారథి, వేటుకూరి సూర్యనారాయణరాజు, యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి కవులూరి పతిరాజు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు, నడింపల్లి సీతారామరాజు, బీకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, మాజీ అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న



సమస్యలను సెప్టెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నల రూపంలో తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 1996 తుపాను తర్వాత కొబ్బరి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో వారి సమస్యలను గుర్తించికేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రధాన తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

తీర్మానాలు ఇవీ

- కోనసీమలో కొబ్బరిని ప్రోత్సహించే విధంగా సీపీసీఆర్ఐ రీజనల్ రీసెర్చ్ సెంటరును కోనసీమలో ఏర్పాటు చేయాలి.
- అన్ని రకాల పంటలకు మూల్య వృద్ధి సేవలు, నూతన సాంకేతికతను రైతులకు బదిలీ చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి.
- కోనసీమలో కోకోనట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్రస్తుతం ఉన్న ప్యాక్ హౌస్ స్కీమును మార్పులు చేసి కొబ్బరి కురిడీ తయారు చేసుకునేలా బాల్‌కోప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీ అందించాలి.
- ఆర్అండ్ఆర్ స్కీము ద్వారా దిగుబడి తక్కువ ఇచ్చే చెట్లను తొలగించి వాటి స్థానంలో అధిక దిగుబడులు ఇచ్చే పొట్టి రకాలను పెంచేలా మైక్రో న్యూట్రియంట్ ఎరువులను సరఫరా చేసే విధానం అమలు చేయాలి.
- కొబ్బరి పండించే ఎనిమిది రాష్ట్రాల రైతులు ఫోరంగా ఏర్పడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి.
- వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా తక్కువ ధరతో కిసాన్ రైలు పేరిట రైల్వే రవాణా సదుపాయం కల్పించాలి.
- కోప్రాకు మద్దతు ధరపై కర్ణాటక ప్రభుత్వం ఇస్తున్న బోనస్ రూ.1,500 మాదిరిగానే కొబ్బరి పండించే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ప్రకటించాలి.
- కొబ్బరిని ఎడిబుల్ ఆయిల్‌గా ప్రకటించి అన్ని రకాల పంటలకు వర్తించే అన్ని రాయితీలను వర్తింపజేయాలి.
- కొబ్బరిని కల్తీచేసే కెర్నాయిల్‌పై పూర్తి నియంత్రణ ఉండాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దింపు సమస్యను అధిగమించే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేయాలి.
- కొబ్బరి బోడకాయ ధర కిలో రూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.



గంజాయి రవాణా ముఠా వివరాలు వెల్లడిస్తున్న నల్లజర్ల సీఐ శ్రీనివాస్




గంజాయి నిందితుల వివరాలు చెప్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా

గంజాయి గుట్టురట్టు

తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లిలో 262 కిలోలు, ఏజెన్సీలో 265 కిలోలు పట్టివేత

నల్లజర్ల, ఆగస్టు 28: కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి చెన్నైకి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను నల్లజర్ల పోలీసులు వలపన్ని పట్టుకుని అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను సీఐ ఎస్.శ్రీనివాస్ వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవివర్మ రమేష్, సూర్య ధనేష్ మురగన్, జీవరత్నం గణేశం, అలుగు నవిన్ పళనిస్వామి కలిసి 262 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఐషర్ వ్యాన్‌లో చెన్నైకి తరలిస్తున్నారు. సీఐ శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారంతో అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఐషర్ వ్యాన్ ముందు ఎస్కార్ట్‌గా ఎరుపు రంగు స్విఫ్ట్ కారు ఉంది. ఐషర్ వ్యానును ఆపి చూడగా గంజాయి బయటపడింది. ఐషర్ వ్యాన్, స్విఫ్ట్ కారు సీజ్ చేసి మొబైళ్లు స్వాధీనం చేసుకుని వారి వద్ద ఉన్న రూ.3,100 నగదు తీసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ శ్రీహరిబాబు, ఏఎస్ఐ మోహన్, హెచ్‌సీ స్టాలిన్, పృధ్వీరాజు, రవికుమార్, షేక్ రషీద్, తారకేశ్వరరావు, తేజేంద్రనాథ్‌లను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు 265 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మొదటి కేసులో తెలంగాణ రాష్ట్రం గోదావరి ఖనికి చెందిన నిమ్మల మణికంఠ ఒడిసాలో 20 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా తెలంగాణకు తరలించే యత్నం చేశాడు. మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. రెండో కేసులో తెలంగాణ రాష్ట్ర యాదాద్రి భువనగిరికి చెందిన ధీరావత్ గణేష్ ఒడిసాలో 215 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ఇతడు కూడా అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా కారులో తరలిస్తూ పోలీస్ చెక్‌పోస్టు వద్ద దొరికిపోయాడు. మూడో కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలానికి చెందిన సోయం సందీప్, షేక్ హర్బజ్, కొర్సా నవీన్, నారకొండ ప్రకాష్, మినప హరిప్రసాద్‌లతోపాటు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సవలం ప్రకాష్, సానబోయిన శ్రావణ్‌కుమార్ పట్టుబడ్డారు. వీరంతా ఒడిసాలో 30 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. వీరంతా చింతూరు బస్టాండులో తెలంగాణ రాష్ట్రం వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తూ పోలీసులకు దొరికిపోయారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక మోటారు సైకిలును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పట్టుబడ్డ 265 కిలోల గంజాయి విలువ రూ.13.25 లక్షలు ఉంటుంది. మూడు కేసుల్లో పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.



మహ్మద్ రిహాన్ మృతదేహం

మదర్సాలో బాలుడి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలోని మదర్సా స్కూల్లో 4వ తరగతి చదువుతున్న మహ్మద్ రిహాన్ మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మంచినీళ్లు తాగుతూ సొమ్మసిల్లి పడిపోయాడు. బాలుడు చనిపోయాడని భావించిన స్కూలు యాజమాన్యం హైదరాబాద్‌లో ఉంటున్న బాలుడి బావ మహ్మద్‌మెర్సిన్‌కు సమాచారం ఇచ్చింది. మహ్మద్ మెర్సిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. రిహాన్ తల్లిదండ్రులు జార్ఖండ్ రాష్ట్రం జెహిర్‌గట్ట గ్రామానికి చెందిన వారు. బాలుడి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

56 మంది డిశ్చార్జి

చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించిన కాకినాడ ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే, ఆర్డీవో

సెలవులు ప్రకటించడంతో ఇళ్లకు తీసుకువెళ్లిన తల్లిదండ్రులు



బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఆర్డీవో సీతారామారావు

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను కాకినాడ



మంచాలు లేక పరుపులపై చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఆర్డీవో సీతారామారావు బుధవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలికల యోగక్షేమాలు, వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన చికిత్స అందించడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. చికిత్స పొందుతున్న బాలికలకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. డీసీహెచ్ఎస్ స్వప్న మాట్లాడుతూ మంగళవారం రాత్రి 72 మందికి వైద్య సేవలు అందించగా బుధవారం ఉదయం మరో 17 మంది చేరారన్నారు. 6వ తరగతి చదువుతున్న జాస్మిన్‌ను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బుధవారం సాయంత్రానికి కోలుకున్న 56 మందిని డిశ్చార్జి చేశామని చెప్పారు. తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి తమ్మయ్యబాబు, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, నాని, కూటమి నాయకులు, కార్యకర్తలు బాలికల యోగక్షేమాలను అడిగి తెలుసున్నారు.

గురుకుల బాలికల సంక్షేమ పాఠశాల, కళాశాలను ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థినులకు పెట్టే మెనూ, వసతులు, తాగునీరు తదితర అంశాలపై ప్రిన్సిపాల్ చంద్రశారదను ఆరా తీశారు. వసతి గృహం, వంటశాల పరిసరాలను పర్యవేక్షించి విద్యార్థినుల ఆహారం, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలోని తుప్పలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు, తాగునీటి శాంపిల్స్‌ను జిల్లా కేంద్రానికి శాంపుల్స్ పంపించామని, రిజల్ట్ వచ్చిన తర్వాత సంబంధీకులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు మెరుగుపడేవరకు సెలవులు ప్రకటించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో తల్లిదండ్రులు వచ్చి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు

నేడు కౌన్సెలింగ్

కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో ఉదయం 8 గంటల నుంచి

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 28: వార్డు, సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదిలీలు కోరుకునే వారంతా తమ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. సంబంధిత శాఖల్లో ఖాళీల ఆధారంగా బదిలీ ప్రక్రియ జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధి గల 319 వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల్లో బదిలీ కోరుకునే వారంతా సంబంధిత వెబ్‌సైట్‌లో ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అపాయింట్‌మెంట్ అథారిటీ పరిశీలించి కాకినాడ స్మార్ట్ సిటీలో గురువారం వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 319 సచివాలయాల ఉద్యోగులకు కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో కమిషనర్ భావన ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆర్‌డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పెద్దాపురం కమిషనర్, వెల్ఫేర్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఇమ్యూనిటీ సెక్రటరీలకు, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్‌డీటీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ మొదలవుతుంది. కమిషనర్లతో పాటు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సెక్షన్ల సూపరిటెండెంట్లు, గుమస్తాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సహకరించనున్నారు. బదిలీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు జాయినింగ్ ఆర్డర్ ఇస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో గంజాయిని మూలాలతో పెకిలిస్తాం

ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై నేరాలను సహించేది లేదు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'గంజాయిని అరికట్టడంపై తీవ్రంగా దృష్టిసారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాము. ఉత్పత్తి, విక్రయ, నిల్వ, వాడకందారులను వదిలేది లేదు. గంజాయి మహమ్మారిని మూలాలతో పెకిలించడానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పక్కాగా సిద్ధమయ్యాం' అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలోని తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్‌తో కలిసి నేరాలపై సమీక్షించారు. ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై కూడా దృష్టి పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిఘా ముమ్మరం చేశామన్నారు. విజిబుల్ పోలీస్, ఇన్విజిబుల్ పోలీసింగ్ విధానాలతో నేరాలను కట్టడి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, మిస్సింగ్ కేసుల్లో వేగంగా స్పందించాలన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్, నేరాలు, రోడ్డు ప్రమాదాల అదుపునకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఐజీకి ఎస్పీ నరసింహ కిషోర్ వివరించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని, స్నేహపూర్వక పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్ర యూనిట్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 28: 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. ఇప్పటివరకు విలన్, క్యారెక్టర్ యాక్టర్‌గా చేసిన రావు రమేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం నవ్వుల పువ్వులు పూయిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విజయ యాత్రలో భాగంగా రాజమహేంద్రవరంలో సినిమా ప్రదర్శిస్తున్న శివజ్యోతి థియేటర్‌కి బుధవారం సాయంత్రం చిత్ర యూనిట్ విచ్చేసి సందడి చేసింది. లక్ష్మణ్ కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ తదితరులు నటించారు. పుష్ప డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత ఈ చిత్రాన్ని సమర్పించారు. సినిమా ప్రమోషన్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ కావడం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. వర్ధమాన నటుడు అంకిత్, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ స్క్రీన్ దగ్గర ఏర్పాటుచేసిన వేదిక దగ్గరకు వచ్చి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ఉదయరాజు, సత్తి సత్తిరెడ్డి చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు. నటుడు అంకిత్ మాట్లాడుతూ తాను ఇంతవరకు 12 సినిమాల్లో నటించినా, ఈ సినిమాతోనే మంచి గుర్తింపు లభించిందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుకింద పడి మహిళ మృతి

కాకినాడ క్రైం, ఆగస్టు 28: కాకినాడలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన గుమ్మళ్ల నాగరత్నం (35) బుధవారం రాత్రి కాకినాడ జగన్నాథపురం నుంచి యానాం రోడ్డు వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఆమె శివాలయం వద్దకు వెళ్లేసరికి అటువైపే కాకినాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం కింద ప్రమాదవశాత్తూ అదుపు తప్పి నాగరత్నం పడిపోయింది. ఆమె తలపై భాగం నుంచి బస్సు చక్రం ఎక్కడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాకినాడ వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఈవీఎం, వీవీప్యాట్‌లకు భద్రత : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 28: ఈవీఎం, వీవీప్యాట్‌లకు భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : ఎస్‌డీపీవో

సర్పవరం జంక్షన్, ఆగస్టు 28: విద్యార్థుల మనోభావాలను కించ పరిచేలా చేసి ర్యాగింగ్‌కి పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించేదిలేదని, ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీపీవో) రఘువీర్ విష్ణు అన్నారు. బుధవారం తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఆల్కహాలిజం 2024-25పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కాలేజీల్లో ర్యాగింగ్ భూతం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సీనియర్ అడ్వకేట్ జాబ్ సయ్యద్ సలార్, సైకాలజిస్ట్ డాక్టర్ వినులు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించిన అనంతరం క్యాంపస్‌లో డీఎస్పీ మొక్కలు నాటారు. యాంటీ ర్యాగింగ్ విభాగం నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ఎం.నానిబాబు, రాధా మాధవి, అధ్యాపకులు డాక్టర్ ఎం.పోచయ్య, డాక్టర్ కే.జోసఫ్ స్టీఫెన్, డాక్టర్ మధుకుమార్, డాక్టర్ గోపీ, మనోజ్ దేవ, తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు పాల్గొన్నారు.

'ఈ-క్రాప్ నమోదు నూరుశాతం పూర్తిచేయాలి'

కరప, ఆగస్టు 28: ఈ నెలాఖరు నాటికి ఈ-క్రాప్ నమోదును నూరుశాతం పూర్తిచేయాలని, అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డుల మంజూరు చేయాలని తహశీల్దార్ పిండి గోపాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఏపీ రాజేష్ సూచించారు. స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో బుధవారం వీఆర్‌వోలు, వీఏఏలు, ఏఈవోలతో సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 4,900 మందికి సీసీఆర్ కార్డులు ఇవ్వాల్సిఉండగా వారిలో 4,367మందికి మంజూరు చేశామన్నారు. మండలంలో 14,026 ఎకరాల్లో ఖరీఫ్ సాగుచేస్తుండగా ఇప్పటివరకు 11,120 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. నిర్దేశిత లక్ష్యాలను వెంటనే పూర్తిచేయాలని సూచించారు. సర్వేయర్ ఈ.రామకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచరరావు తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రత్తిపాడు, ఆగస్టు 28: ప్రత్తిపాడులోని జాతీయ రహదారిని అనుకుని నరేంద్రగిరి కొండపై శ్రీమద్ రామాయణ పీఠం ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న ఆంధ్రా భద్రాద్రి ఆల య ప్రాంగణంలో బుధవారం ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలకుడైన మనోవాంఛ అంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి దాత మదినే నూకరాజు కుటుంబసభ్యులు మదినే సురేష్, శ్రీదేవిలచే సూర్యభాస్కరేంద్ర సరస్వతిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేయించారు. స్థలం దాత చలంకూరి భాను, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోగుల వెంకటేశ్వరరావు, దాట్లపుష్పారెడ్డి, మిసర్వా రమేష్‌రాజు, పత్రి రమణ, వెలుగూరి హరేరాం, నేతి శ్రీనివాసరావు, ఏడిద రెడ్డి నాయుడు, గానాల గంగాధర్, యల్లపు రాంప్రసాద్ పాల్గొన్నారు.

వైద్యఆరోగ్యశాఖ అధికారులపై విచారణ

జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 28: జిల్లా వైద్యఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులుగా పనిచేస్తున్న ముగ్గురి పై బుధవారం విచారణ ప్రారంభమైంది. డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్నను విచారణాధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఫిర్యాదుదారుడు ఎస్.ఫణీశ్వరరావు విచారణకు హాజరయ్యారు. ఆయన నుంచి ముగ్గురు అధికారులపై ఆరోపణలకు సంబంధించి వివరాలను సేకరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో గతంలో డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ ఆర్.రమేష్, డిప్యూటీ డెమో కె.సూర్యచంద్రరావు, ఎస్‌వో వి.విజయలక్ష్మి ఉన్నారు. విచారణ మరికొన్ని రోజులు కొనసాగనుంది. విచారణానంతరం నివేదికను డీసీహెచ్ఎస్ ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

2 నుంచి యానిమేటర్ల రిలే నిరాహారదీక్షలు

కాకినాడ సిటీ, ఆగస్టు 28: జిల్లాలో రాజకీయ వేధింపులతో యానిమేటర్ల తొలగింపు ఆపాలని, బకాయిపడ్డ 6నెలల వేతనాలు తక్షణం చెల్లించాలని కోరుతూ సెప్టెంబరు 2 నుంచి డీఆర్డీఏ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు సీఐటీయూ అనుబంధ ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని తెలిపారు. బుధవారం ధర్నా నిర్వహించి డీఆర్డీఏ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. తక్షణం తొలగింపులు ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వీవోఏ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరి, అమ్మాణి, సత్యవేణి, రాణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 28: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరపాలక సంస్థ నాలుగో తరగతి ఉద్యోగులు కమిషనర్ భావనకు వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు, అధ్యక్షుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ ఏళ్ల తరబడి సేవలందిస్తున్న నగరపాలక సంస్థ నాల్గో తరగతి ఉద్యోగులకు గుమాస్తాలుగా, బిల్ కలెక్టర్లుగా పదోన్నతులు అమలు కావడం లేదన్నారు. అసోసియేషన్ నాయకులు ఎం.సత్తిరాజు, పి.భవాని, ఎంవి శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, జి.దుర్గారావు, ఐవి దుర్గారావు, కమలహాసన్, ఎన్.శివ, సుమంగళి పాల్గొన్నారు.

రెండో రోజు పన్నులశాఖ ఉద్యోగుల నిరసన

సర్పవరం జంక్షన్, ఆగస్టు 28: కాకినాడ రూరల్ రమణయ్యపేట వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయం వద్ద రెండో రోజు బుధవారం భోజన విరామంలో తమ నిరసన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన 2.0 పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధంగా జరిగిన అధికార వికేంద్రీకరణ, రీజినల్ కార్యాల వ్యవస్థను రద్దు చేసిన తర్వాతే బదిలీలు చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ ఏపీ వాణిజ్య పన్నుల శాఖ (ఏపీసీటీ) అసోసియేషన్ కాకినాడ డివిజన్ అధ్యక్షుడు పి.విజయకుమార్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అనిశెట్టి వీవీఎస్ స్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీను, వై.గిరిష్, నారాయణమూర్తి సభ్యులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

జగ్గంపేట, ఆగస్టు 28: జగ్గంపేటలో బుధవారం కేన్సర్‌పై అవగాహన ర్యాలీని కమ్యూనిటీ పారామెడికల్స్ ప్రైమరీహెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ)లు బుధవారం నిర్వహించారు. ర్యాలీని కాకినాడ చెందిన మెడికవర్ హాస్పిటల్ క్యాన్సర్ డాక్టర్ పృధ్వీరాజ్ ప్రారంభించారు. స్థానిక బిలాల్ షాదీఖానా ఉర్దూ గర్‌లో మండలాధ్యక్షుడు షేక్‌నూరుద్దీన్ బాషా అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కేఎస్‌ప్రసాద్, జిల్లా కార్యదర్శి ఎండీ తానీషా, మండల కార్యదర్శి జగతాబాబ్జి, కోశాధికారి ఎ.రమణ, గౌరవాధ్యక్షుడు మూర్తి తదితరులున్నారు.

'ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 28: గొల్లప్రోలు పట్టణం, మండల పరిధిలో గల గ్రామాల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కే.సత్యనారాయణ హెచ్చరించారు. గొల్లప్రోలు, పరిసర గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. మండలంలోని రైతులకే విక్రయాలు జరపాలని డీలర్లను ఆదేశించారు.

'గురుకులం ఘటనపై విచారణ జరిపించాలి'

ఏలేశ్వరం, ఆగస్టు 28: ఏలేశ్వరంలో గురుకులంలో కలుషిత ఆహారం ఘటనపై విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ ప్రత్తిపాడు శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో వరలక్ష్మీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థినుల అస్వస్థతకు గల కారణాలు, ఆహార పదార్థాలపై విచారణ పూర్తిస్థాయిలో జరపాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్టెం వెంకటరమణ, జగదీష్, సందీప్ పాల్గొన్నారు.

పసరు రంగులో తాగునీరు!

సామర్లకోట, ఆగస్టు 28: పట్టణ ప్రజలందరికీ కుళాయిల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాల్సిన మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత 2 రోజులుగా పసరు రంగులోనే తాగునీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నా మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



చెత్త నుంచి సంపద కార్యక్రమానికి శ్రీకారం

సాలిడ్ వేస్ట్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ హరిప్రసాద్



ఎఫ్‌కేపాలెంలో చెత్తసేకరణ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ హరిప్రసాద్

పిఠాపురం రూరల్, ఆగస్టు 28: చెత్త నుంచి సంపద కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గం నుంచి శ్రీకారం చుడుతున్నట్టు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సాలిడ్ వేస్ట్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు గృహాల్లో ఉండే వ్యర్థాలను రోజూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సిబ్బందికి అందజేయాలన్నారు. వారు తడి, పొడి చెత్తగా వేరు చేసి వాటి నుంచి వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువుల తయారీ, విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తారని తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని కృష్ణా జిల్లాలో ప్రారంభించారని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో ఎఫ్‌కేపాలెం నుంచి శ్రీకారం చుడుతున్నామని, త్వరలో నియోజకవర్గమంతా విస్తరిస్తామని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసన్, గ్రామసర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి, జనసేన నాయకులు పిల్లా శ్రీధర్, శివశంకర్, జవ్వాది జోగేశ్వరరావు, బీజేపీ నేత జి.కొండలరావు ఉన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాల ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్సీ

పిఠాపురం, ఆగస్టు 28: పట్టణంలోని పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరగనున్నాయి. ఉమాకుక్కుటేశ్వరస్వామి చెంత కొలువైన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్టాన దేవతయిన పుర్హుతికాఅమ్మవార్ల సన్నిధిలో జరగనున్న ఈవ్రతాలను 4 బ్యాచ్‌లుగా నిర్వహించనున్నారు.6వేలమందికి పైగా మహిళలు పూజల్లో పాల్గొనేలా దేవదాయశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్రతాలకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి హాజరవుతారని చెబుతున్నారు. కాగా వ్రతాల ఏర్పాట్లు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. మహిళా భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని వారు సూచించారు. దేవదాయశాఖ సహాయ కమిషనరు, ఈవో దుర్గాభవానీ, పిఠాపురం సీఐ శ్రీనివాస్,నాయకులు ఉన్నారు.

ఇదిలా ఉండగా పూజలు చేసుకునే మహిళలకు అందించేందుకు పసుపు కుంకుమ, చీరలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన సొంత నిధులతో పంపించారు. మొత్తం 12వేల చీరలు పంపగా, వీటిలో 6వేల చీరలను పాదగయ క్షేత్రంలో, పూజాది కార్యక్రమాలు అనంతరం మరో 6వేల చీరలను చేబ్రోలులోని పవన్ నివాసం వద్ద వాటిని మహిళలకు అందజేయనున్నట్టు జనసేన వర్గాలు తెలిపారు.

పన్నుల వసూళ్లలో కాకినాడ నగరపాలక సంస్థ ముందంజ



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 28: పన్నుల వసూళ్లలో కాకినాడ నగరపాలక సంస్థ అన్ని మున్సిపాల్టీల కన్నా మిన్నగా ఉందని రాష్ట్ర ఐదో ఆర్థిక సంఘ కమిషన్ చైర్మన్ ఎస్.రత్నకుమారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిఫ్త్ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ సభ్యులతో కలిసి బుధవారం ఆమె కాకినాడ నగరపాలక సంస్థకు విచ్చేశారు. కాకినాడ కమిషనర్ భావనతోపాటు జిల్లాలోని పలు మున్సిపాల్టీలు, నగర పంచాయతీల కమిషనర్లతో సమావేశమయ్యారు. పన్నులు నూరుశాతం వసూళ్ల తదితర అంశాలపై సమీక్షించారు. సభ్యులు కేవీ.రమణారెడ్డి, ఎం.ప్రసాద్‌రావు, ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావు, డీసీ శేఖర్, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్ పాల్గొన్నారు

జేఎన్టీయూకే ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, పాత్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం

జేఎన్టీయూకే, ఆగస్టు 28: వర్సిటీలోని వీసీ సమావేశ హాల్లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, అమెరికాలోని పాత్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం జరిగినట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా ఏపీలో పౌరసరఫరాలశాఖ ద్వారా రాష్ట్రంలోని ప్రజలకు అందించే బియ్యం, నిత్యావసర సరుకులు సరఫరా చేసే ముందు పాత్ ఫౌండేషన్ సహకారంతో జేఎన్టీయూకే ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ అధ్యక్షతన నాణ్యతా పరీక్షలు చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. వీసీ సమక్షంలో సంతకాలు చేసిన అవగాహనా ఒప్పందపత్రాలను డాక్టర్ రమేష్, పాత్ ఫౌండేషన్ సౌత్‌ఏషియా డైరెక్టర్ నీరజ్ జైన్, ఏపీ పాత్ ఫౌండేషన్ హెడ్ డాక్టర్ సమీరా మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీరమణ ఉన్నారు.

అనుమతుల్లేని వసతి గృహం నుంచి విద్యార్థుల తరలింపు

గండేపల్లి, ఆగస్టు 28: మండలంలోని కె.నాయకంపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హాస్టల్‌లో ఉన్న పిల్లలను బుధవారం జగ్గంపేట సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు తరలించారు. గండేపల్లి తహశీల్దార్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీవో ఎం.పూర్ణిమ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పోలీస్ సిబ్బంది సహకారంతో జగ్గంపేట హాస్టల్‌లో పిల్లలను అప్పగించారు. నాయకంపల్లి హాస్టల్‌లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడాన్ని గుర్తించి అక్కడి నుంచి 10 మంది అబ్బాయిలను సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం, ఇద్దరు అమ్మాయిలను బీసీ వెల్ఫేర్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ పార్వతి, వీఆర్వో సాయిప్రసాద్, ఎస్‌కె బాబా ఉన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

కరప, ఆగస్టు 28: మండలంలో పెనుగుదురు సబ్ సెంటర్ పక్కన ఖాళీగా ఉన్న పంచాయతీ స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించి అందులో షాపు నిర్మాణం చేపట్టడం వివాదాస్పదమైంది. స్థానికంగా నివాసముంటున్న సదరు వ్యక్తి బుధవారం ఉదయం ఖాళీ స్థలంలో గోతులు తీయించి షాపు నిర్మాణానికి యత్నించాడు. గ్రామస్తులు విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. దీంతో కార్యదర్శి చంద్రకళ పనులను ఆపి ఆక్రమణదారుడికి నోటీసు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొనసాగుతున్న క్రీడోత్సవాలు

కాకినాడ అర్బన్, ఆగస్టు 28: జాతీయ క్రీడోత్సవాల్లో భాగంగా ఈ నెల 23 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న క్రీడోత్సవాలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో బుధవారం కొనసాగాయి. స్విమ్మింగ్, ఫుట్‌బాల్, రెజ్లింగ్ పోటీలు నిర్వహించగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 75మంది బాలికలు, 140మంది బాలురు పాల్గొన్నారు. క్రీడాకారులు మైదానంలో ఫిట్‌ఇండియా ప్రతిజ్ఞ చేశారు.

తెలుగు భాషా దినోత్సవం

పెద్దాపురం, ఆగస్టు 28: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ గురు సహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ హాజరయ్యారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలుగుభాషలో విద్యార్థులను జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డీనేటర్ ప్రశాంతి, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్.మూర్తి, పాఠశాల మేనేజర్ రామకృష్ణప్రముఖ న్యాయవాది చిన్ని తదితరులున్నారు.



సహస్రావధాని వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆయిల్‌పామ్ పంటల సాగును విస్తరించాలి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడులో ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, ఆగస్టు 28: ఆయిల్‌పామ్ రైతులకు అన్నివిధాలుగా ఉద్యానవనశాఖ ఏపీ ఆయిల్ ఫెడ్‌లు, ప్రోత్సాహకాలు అందిస్తుందని లాభదాయకమైన ఈ పంటలసాగును రైతులు విస్తరించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో బుధవారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులకు 2023-24 సంవత్సరానికి గాను మొక్కల పెంపకానికి 40శాతం, మొదటి సంవత్సరం మొక్కల నిర్వహణకు 483 మంది రైతులకు రూ.81లక్షలు వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్, ఇరిగేషన్ అధికారి జీ.వరప్రసాద్, నియోజకవర్గ కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, వరుపుల రామకృష్ణ ఎస్.సీతారాం, మదినే దొరబాబు, రీసు సత్తిబాబు, సుబ్బారావు, ముత్యాల రాంబాబు, మదినే వీరభద్రం, ఉద్యాన అధికారిణి ఎ.శ్రీవల్లి, పి.అరుణ్, ఏపీ ఆయిల్‌ఫెడ్ రీజనల్ అధికారి జి.జగదీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టించాలి

రౌతులపూడి, ఆగస్టు 28: వైసీపీ చీకటి పాలన రోజులు పోయాయని.. ఇక గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచించారు. రౌతులపూడిలో మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ గంటిమళ్ల రాజ్యాలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మూలగపూడిలో వైద్యులు అందుబాటులో ఉండడంలేదని సర్పంచ్ తమరాల సత్యనారాయణ తెలిపారు. పి.చామవరం సర్పంచ్ నందమూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఆగస్టు 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాల రుణాల పేరుతో కోట్లాది రూపాయిలను నొక్కేశారని, రాష్ట్రవ్యాపంగా భారీ కుంభకోణం జరిగిందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. నాయకులు, యానిమేటర్లు, వీఏఏలు, ఏపీఎంలు, డీపీఎంలు, బ్యాంకు అధికారులు కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని నడిపారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరనున్నట్లు వెల్లడించారు. మహిళా సంఘాల సభ్యులతో కలిసి పిఠాపురం టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పిఠాపురం మండలం బి.కొత్తూరు గ్రామంలోనే రూ.14కోట్లు మేర బ్యాంకు రుణాలను పక్కదోవ పట్టించారని, సుమారు 20గ్రామాల నిధులను పక్కదోవ పట్టించారని తెలిపారు. బి.కొత్తూరులో ఉన్న సంఘాల్లో నిబంధలనకు విరుద్ధంగా పిఠాపురం, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, శంఖవరం, కోటనందూరు, ప్రత్తిపాడు తదితర మండలాల్లోని మహిళలను సభ్యులుగా చేర్చారని చెప్పారు. తప్పుడు పత్రాలతో రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు ఇప్పుడు నకిలీ సంఘాల్లోని సభ్యులకు నోటీసులు జారీ చేసి అప్పులు తిరిగి చెల్లించాలంటూ ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలు మహిళా సంఘాల నాయకులు, టీడీపీ నేతలు దొడ్డి నాగు, పిల్లి చిన్నా, నల్లా శ్రీను, బస్వా సత్యనారాయణ, కొరుప్రోలు శ్రీను, ఎలుబండి బాబులు, పిల్లా సురేష్, కోళ్ల చిన్న, పెదపాటి బాల పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళి

కాకినాడ సిటీ, ఆగస్టు 28: విద్యుత్ ఉద్యమం ఫలితంగా 15 ఏళ్లపాటు రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా విద్యుత్ చార్జీలు పెంచలేదని సీఐటీయూ నాయకులు అన్నారు. కచేరీపేటలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యుత్ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, ఉపాధ్యక్షురాలు ఎరుబండి చంద్రావతి, టి.రాజా, మేడిశెట్టి వెంకటరమణ, దడాల పద్మ, దాడి బేబి పాల్గొన్నారు.

పెద్దాపురం: విద్యుత్ పోరాట అమర వీరుల పోరాట వారసత్వాన్ని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో విద్యుత్ అమరవీరుల సంస్మర సభ కార్యక్రమంలో ఆయన విద్యుత్ పోరాట అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడిగట్ల సత్తిబాబు, చల్లా విశ్వనాథం, కూనిరెడ్డి అరుణ, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, మహాపాతిన రాంబాబు. ఎన్.నరసింహమూర్తి, దారపు రెడ్డి క్రాంతికుమార్, అమృత, నమ్రత పాల్గొన్నారు.

పిఠాపురం: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిలకు పట్టణంలోని నండూరి ప్రసాదరావు భవనంలో సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, నాగేశ్వరరావు, రాజేష్, అప్పన్న, సూర్యనారాయణ పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

కరప, ఆగస్టు 28: చవితి ఉత్సవాలకు బుధవారం కరప కన్నబాబు కాలనీ వద్ద సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో రాట ముహూర్తం చేసి వినాయక మండపం పనులు ఆరంభించారు. సిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు ముద్రగడ నానాజీరావు, కూనపురెడ్డి వీర్రాజు, పడాల రామకృష్ణ, కొండేపూడి పాండవులు, తాతీలు, దేవు దుర్గారావు, సీహెచ్ సత్యనారాయణ, రాజు, శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని మున్సిబ్‌వారి రామాలయం సమీపంలో మేడదొడ్డి వీధిలో వెలిసిన వరసిద్ధి వినాయకుని మహోత్సవాలకు పందిరిరాట మహోత్సవం నిర్వహించారు. జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, వీర వెంకట అనంతలక్ష్మిదంపతులు పూజలు చేశారు. దిడ్డి వెంకటరమణ, మదినే బాబ్జి, రామాలయ కమిటీ చైర్మన్ మదినే శ్రీను, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి'

గొల్లప్రోలు, ఆగస్టు 28: వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాలను 9 రోజులు పాటు ఘనంగా నిర్వహించాలని గణేష్ ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ యెనిమిరెడ్డి మాలకొండయ్య పిలుపునిచ్చారు. గొల్లప్రోలులో నగర గణేష్ ఉత్సవ సమితిని ఆయన బుధవారం ప్రారంభించి అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, నాయకులు మలిరెడ్డి నారాయణ రావు, కర్రి సత్యనారాయణ, పడాల శ్రీను, పోసిన సత్యనారాయణ, మేడసాని కామరాజు, బోడకుర్తి పెద్దిరాజు, వియ్యపు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

కిర్లంపూడి, ఆగస్టు 28: జగపతినగరంలో పైడితల్లి అమ్మవారి 109వ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి ప్రసాద్, కమిటీ సభ్యులు ఆళ్ల బుజ్జి, చదరం సునీత, మల్ల సుబ్బారావు, దాడి భద్రం, కె.ఏసుబాబు, డి.చినగోవిందు, నూకరాజు, శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా జాతర చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు బారులు తీరారు. టీడీపీ నేతలు చదరం చంటిబాబు, నల్లబ్బాయి, ఎంపీటీసీ ఆళ్ల నానాజీ, శ్రీమన్నారాయణ, పెంటకోట శ్రీరాములు పలువురు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చదలాడలో వైద్యశిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజప్ప



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న రాజప్ప

పెద్దాపురం, ఆగస్టు 28: మండలంలోని కాండ్రకోట, దివిలి, చదలాడ గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విష జ్వరాలతో మృతి చెందడంతో బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం పరామర్శించి వారికి అండగా ఉంటామన్నారు. అలాగే చదలాడలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితిపై పులిమేరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాగాల ఉమామహేశ్వరరావు, కేదారి నల్లబాబు, మెయిళ్ల కృష్ణమూర్తి, చాగంటి గోపాలకృష్ణ, మత్తాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కొండబాబు



వివరిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, ఆగస్టు 28: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. కాకినాడ నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చంద్రబాబుతో చర్చించారు.

గురజనాపల్లి హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు

కరప, ఆగస్టు 28: గురజనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు దక్కినట్టు హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు. గత విద్యాసంవత్సరంలో పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో నుంచి ఈ అవార్డును స్వీకరించనున్నామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావు,స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రికి ఏసీ బహూకరణ

పెద్దాపురం, ఆగస్టు 28: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పట్టణానికి చెందిన ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ పసుపులేటి సాయిబాబు ఆయన కుమారుడు ఫణీంద్ర టూటన్ కెపాసిటీ ఏసీ మిషన్‌ను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డికి అందచేశారు. ప్రసూతి వార్డులో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నట్టు తెలియడంతో వారు ఏసీ అందజేసినట్టు తెలిపారు. అలాగే మనపెద్దాపురం ఫేస్‌బుక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మృత్యుత్వం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు.

డి.పోలవరంలో 'పొలం బడి'

తుని రూరల్, ఆగస్టు 28: పొలం బడి కార్యక్రమంలో భాగంగా డి.పోలవరంలో మండల ఏవో అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు అజొల్లా పెంపకంపై అవగాహన కల్పించి అ జొల్లాను వరి పొలంలో జల్లి డెమో నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శంఖవరం, ఆగస్టు 28: శంఖవరం మండల పరిధిలో గల గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట డీఈ కే.రత్నాలరావు తెలిపారు. 33కేవీ-11 కేవీలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు కామ్రేడ్ సుబ్బారావు సంస్మరణ సభ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 28: కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీకన్వెన్షన్ హాల్లో గురువారం కామ్రేడ్, తెలుగు జాతీయ మహాసభల వ్యవస్థాపకుడు ఉప్పులూరి సుబ్బారావు సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ ట్రేడ్ యూనియన్స్ (ఎఫ్ ఐటీయూ) ప్రధాన కార్యదర్శి సీహెచ్ఎస్ఎన్.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

పిఠాపురం పురపాలక సంఘం

హెచ్చరిక

పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరిచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారికముగా లే-అవుట్లును గుర్తించడమైనది.

గమనిక: అనధికారికముగా లే అవుట్ వేసి మరియు అమ్మకములు చేయుచున్న స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

వ.నెం	అనధికార లే-అవుట్ పేరు	విస్తీర్ణము సుమారు (ఎకరాలలో)	సర్వే నెంబరు	రెవిన్యూ విలేజ్	మండలము
1.	చిట్టోడి తోట	1.43	158/2D	అగ్రహారం	పిఠాపురం
2	సీతారాంపురం రోడ్డు	0.70	681/1	పిఠాపురం	పిఠాపురం
3	మాధాపురం రోడ్డు	1.00	710	పిఠాపురం	పిఠాపురం
4	బొజ్జావారి తోట	1.70	713/21	పిఠాపురం	పిఠాపురం
5	బొజ్జావారి తోట	0.49	713/21	పిఠాపురం	పిఠాపురం
6	వై.యస్.ఆర్.గార్డెన్స్	0.97	719/4	పిఠాపురం	పిఠాపురం
7	ఆర్.టి.సి.కాంప్లెక్స్ ప్రక్కన	0.52	773/2	పిఠాపురం	పిఠాపురం
8	తారక రామ నగర్	6.50	718	పిఠాపురం	పిఠాపురం
9	వై.యస్.ఆర్.గార్డెన్స్	1.27	767/4	పిఠాపురం	పిఠాపురం
10	వై.యస్.ఆర్.గార్డెన్స్	1.38	719/P	పిఠాపురం	పిఠాపురం
11	మాధాపురం రోడ్డు	7.26	713/P	పిఠాపురం	పిఠాపురం
12	మోహన్ నగర్	3.91	565/3B	పిఠాపురం	పిఠాపురం
13	గోర్స రోడ్డు	1.75	553/1	పిఠాపురం	పిఠాపురం
14	గోర్స రోడ్డు	0.92	553/2	పిఠాపురం	పిఠాపురం
15	కత్తుల గూడెం	0.25	250/1	పిఠాపురం	పిఠాపురం
16	రథాలపేట	1.23	486/1	పిఠాపురం	పిఠాపురం
17	సీతయ్యగారితోట	0.53	160P	పిఠాపురం	పిఠాపురం
18	విరవాడ రోడ్డు	0.98	124/2,3	పిఠాపురం	పిఠాపురం
19	NH 216 ప్రక్కన	2.38	168	పిఠాపురం	పిఠాపురం
20	డ్రైవర్స్ కాలనీ	2.24	616/1A(P)	పిఠాపురం	పిఠాపురం
21	డ్రైవర్స్ కాలనీ	2.00	618(P)	పిఠాపురం	పిఠాపురం
22	డ్రైవర్స్ కాలనీ	3.31	647/2	పిఠాపురం	పిఠాపురం
23	డ్రైవర్స్ కాలనీ	9.63	648	పిఠాపురం	పిఠాపురం
24	డ్రైవర్స్ కాలనీ	5.65	652	పిఠాపురం	పిఠాపురం
25	డ్రైవర్స్ కాలనీ	5.45	658/1	పిఠాపురం	పిఠాపురం
26	డ్రైవర్స్ కాలనీ	2.00	656/P	పిఠాపురం	పిఠాపురం
27	సీతయ్యగారి తోట	0.85	806/O	పిఠాపురం	పిఠాపురం
28	సీతయ్యగారి తోట	1.60	159	పిఠాపురం	పిఠాపురం
29	డ్రైవర్స్ కాలనీ	4.51	599(P) 601(P)	పిఠాపురం	పిఠాపురం

కావున పైన తెలియపరచిన లే-అవుట్ నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లు అమ్మకము, కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, విద్యుత్, త్రాగునీరు మరియు డ్రైనేజి సదుపాయములు కల్పించబడవు దీనిని గమనించవలసిందిగా విజ్ఞప్తి. సదరు హెచ్చరిక నోటీసు పట్టణ పరిధిలో గల అన్ని ప్రభుత్వ కార్యాలయముల నోటీసు బోర్డుల నందు మరియు సచివాలయముల యందు ప్రచురించడమైనది.

గమనిక: అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకములు చేయుచున్న స్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును.

కమిషనరు
పిఠాపురం పురపాలక సంఘం